" శ్రీ సాయి అమృత వాణి "



పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్, ఇండియా

www.pssmovement.org

" అల్లా మాలిక్ ! "

" అల్లా మాలిక్ " ... " భగవంతుడే యజమాని " ... " నేను భగవంతుని బానిసను " ... " ఆయన ప్రతినిధులు సర్వత్రా ఉన్నారు " ... " దైవదూషణ చేయకండి " ... " దైవదూషణ వినకండి " ... " అది జరిగే ప్రాంతాలలో ఉండకండి " ... " భగవత్కటాక్షం కోసం త్వరపడండి " ...

" నేనే దైవం ! "

" ఆది, అంతాలు లేని ఈ పాదాలు పరమ పవిత్రమైనవి. శ్రద్ధా భక్తులుంటే ' గంగా ', ' యమున ' తీర్థాలు ఇక్కడే ఉన్నాయి. నేనే దైవం ! సర్వ జగత్తు నాలోనే ఉన్నది. ఈ జగత్తును నడిపించేవాడనూ ... సూత్రధారినీ నేనే ! నేనే జగన్మాతను ! ... నేనే విశ్వయోనిని ! నేను అందరినీ సమానంగానే చూస్తాను. నాకెవ్వరిమీదా కోపం రాదు. తల్లికి ఎప్పుడైనా బిడ్డపై కోపం వస్తుందా ? సముద్రం ఎన్నడైనా నదులను త్రిప్పివేస్తుందా ? నాపై నీ దృష్టి నిలుపు. నేనూ నీపై నా దృష్టి నిలుపుతాను ! నన్ను నమ్మిన వారిని పతనం కానివ్వను. ఈ సత్‌బ్రాహ్మణుడు లక్షలాది జనాన్ని శుభ్రమార్గంలో గమ్యం చేరుస్తాడు ! "

" నా యందే మనస్సు "

" ఎవ్వడైతే ఎప్పుడూ నన్నే చూస్తూ ... నా గురించిన మాటలనే వింటూ ... నా నామాన్నే జపించుతూ ... నా యందే మనస్సు నిలుపుతాడో... వాడు ఇహ పరాల గురించి భయపడాల్సిన పనిలేదు ... నిశ్చయంగా దైవాన్ని చేరుకుంటాడు. ' సాయి ' ... ' సాయి ' ... అంటే సప్త సముద్రాలనూ దాటించుతాను ! "





" బ్రహ్మము "

" జీవుడు తానే బ్రహ్మమై ఉండి కూడా భ్రమచేత తాను జీవుడననీ, దేవుడు వేరుగా ఉన్నాడనీ అనుకుంటున్నాడు. అటువంటి జీవుడు సద్గురువు యొక్క అనుగ్రహం వల్లనే ' నేను జీవుడను కాను ... ఆత్మ స్వరూపమైన బ్రహ్మమును నేనే ' అని తెలిసికొనగలడు. "

" గురువే దైవం "

" గురువే దైవం ! గురువుపై అచంచలమైన విశ్వాసముంచు. సాధనలు గానీ ... షట్‌శాస్త్ర ప్రావీణ్యం గానీ ... అక్కరలేదు ! గురువును హరిహర బ్రహ్మల స్వరూపంగా భావించేవారు ధన్యులు. ఇవతల ఒడ్డున ఉన్న తల్లి తాబేలు అవతలి ఒడ్డున ఉన్న పిల్ల తాబేలును తన దృష్టి మాత్రం చేత పెంచి పెద్ద చేసేటట్లు, గురువు యొక్క కృపాదృష్టే శిష్యునికి అన్న పానీయాలు ! సద్గురువుకు పగ్గాలప్పగించాక చింతకు తావేలేదు. కల్పవృక్షం వంటి సద్గురువు దొరకక దుఃఖంతో తపించావు. ఇదిగో నేను దొరికాను ! నేను కోరే దక్షిణ రెండు ... అవి ' శ్రద్ధ ', ' సబూరి '... విశ్వాసం, ఓర్పు ! పోయేవాడు పోతాడు ... నిలిచేవాడు నిలుస్తాడు ... చిత్తశుద్ధితో తరించే మార్గం చెప్పడమే నా పని ! "

" ఎవరు నా శిష్యుడు ? "

" ఎవరు నా శిష్యుడు అని చెప్పుకునేది ? అలాంటివాడు ఒక్కడూ కనిపించటంలేదు. పూచిన మామిడి పూత అంతా పండ్లుగా మారుతున్నదా? కొన్ని పూతలోనే రాలిపోతున్నాయి ... ఇంకొన్ని పిందెలుగా రాలిపోతాయి ... కొన్ని మాత్రమే పండ్లు అవుతాయి. నా దగ్గరకు అన్నీ నొక్కుపోయినవీ ... సొట్టపోయినవీ అయిన నాణాలే వస్తున్నాయి ! నా దగ్గరకు వచ్చే కుండలన్నీ తలక్రిందులుగానే వస్తున్నాయి ! నా ప్రభువు ' తీసుకో '... ' తీసుకో ' అంటున్నాడు. కానీ నా దగ్గరకు వచ్చేవారు ' తే '... ' తే ' అంటున్నారు. "

“ ఏ మంత్రమూ లేదు ! ”

“ ఎవరైతే తాము బద్ధులమని గ్రహించి ... బంధాల నుండి బయట పడడానికి కృతనిశ్చయులై ... ఇతర సుఖాలమీద కోరిక మాని ... ‘ పరం ’ కోసం ప్రయత్నిస్తారో ... వారే ... ఆధ్యాత్మిక జీవితానికి అర్హులు. ఆధ్యాత్మిక విద్యను అభ్యసించదలచిన వారికి ‘ సత్సంగం ’, ‘ సద్గ్రంథపఠనం ’ అత్యంత ప్రధానమని గుర్తుంచుకొనండి. ఉపదేశాలకోసం ప్రాకులాడవద్దు. నా గురువు గారు నా చెవిలో ఏ మంత్రమూ ఊదలేదు ! మంత్రం గానీ, మరే ఉపదేశం గానీ ఎవరిఫద్దనుండీ పొందవద్దు ! ”



“ లోనున్న ఆత్మ ! ”

“ ఎవరి పనులను వాళ్ళు ఫలాపేక్ష రహితంగా చేయనిదే మనస్సు నిర్మలం కాదు. మనస్సు నిర్మలం కానిదే ... వాంఛ, లోభం, అహంకారం నశించనిదే ... దేహాభిమానాన్ని విడువనిదే ... ఆత్మ సాక్షాత్కారాన్ని పొందలేరు ! ఆత్మసాక్షాత్కారాన్ని కోరేవాడు దృష్టిని లోపలకు పోనిచ్చి, లోనున్న ఆత్మనే తదేక ధ్యానంతో చూడాలి. ”

“ ధ్యాన చైతన్యం ”

“ ఆత్మజ్ఞానానికి నిరంతరం ధ్యానం అవసరం. నిరంతర ధ్యానం వలన మనస్సు స్థిరమవుతుంది. ఏది ఏమైనా గానీ ... పట్టిన పట్టు విడువక ... విశ్వాసం, ఏకాగ్రత కలిగి ధ్యానం చెయ్యాలి. ధ్యానించేనీవూ ... ధ్యానించబడే నేనూ ... ధ్యానమనే క్రియా ... వేరు వేరుగా కాక ... సర్వవ్యాప్తమైన చైతన్యమే అనుభవమౌతుంది. ఆ చైతన్యమే ఆనందం ! ”

" నిర్వికల్ప సమాధి "


" తొలి ప్రసంగ సమాప్తి ... మలి ప్రసంగ ప్రారంభాలకు మధ్యగల క్షణకాలం ' చిదాకాశం ' అనబడుతుంది. ఆ ' చిదాకాశ ' మే ' ఆత్మ '! ఆ ' ఆత్మ ' యే ' నీవు '! అదే ' నేను '! ' నేనే ' ' బ్రహ్మం '! ఆ విధంగా బయలుగా ఊరకుండిన ' చిదాకాశం ' లో ఏ ఆలోచనా చేయకుండా ఊరకే ఉండాలి. అదే ' నిర్వికల్ప సమాధి '! అది అనుభవించవలసిన ఆనందమే కాని ... ఇతరులకు తెలుపగలిగేది కాదు ! "

" దుఃఖం లేకపోవడమే ముక్తి ! "

" భూమి విత్తులను ధరిస్తుంది ... మేఘాలు వర్షిస్తాయి ... సూర్యుడు తన కిరణాలతో వాటిని మొలిపిస్తాడు. భూమి, మేఘాలు, సూర్యుడు వాటి పని అవి చేసుకుపోతాయి. విత్తనాలు మొలిచినందుకు సంతోషించవు ... మాడిపోతే దుఃఖించవు ! అలాగే నువ్వూ చలించకూడదు. ఇక దుఃఖమెక్కడిది ? దుఃఖం లేకపోవడమే ' ముక్తి '! "

" పదమూడు ? "

" దైవం ఒక్కడే ... తత్వాలు రెండు ...
గుణాలు మూడు ... వేదాలు నాలుగు ...
ఇంద్రియాలు ఐదు ... శాస్త్రాలు ఆరు ...
సముద్రాలు ఏడు ... ఐశ్వర్యాలు ఎనిమిది ...
గ్రహాలు తొమ్మిది ... ఉపనిషత్తులు పది ...
రుద్రులు పదకొండుగురు ... ఆదిత్యులు
పన్నెండుగురు ... లోకాలు పద్నాలుగు ...
మహావిద్యలు పదిహేను ... మహారాజులు
పదహారుమంది. కానీ మధ్యలో మరచి
పోయిన పదమూడు సంఖ్య ఏమిటి ? "




" ఊది ... జ్ఞానస్వరూపం ! "

" ' ఊది ' అంటే ' కేవలం కట్టెలను కాల్చిన బూడిద గదా ... ' అని అనుకొనడం అవివేకమే సుమా ! మన హృదయమే ధుని ... అజ్ఞానమే కట్టెలు ... సదసద్వివేకమే అగ్ని ... దాని పరిణితి అయిన ఊదియే జ్ఞానస్వరూపం. "

" బ్రహ్మజ్ఞాన జిజ్ఞాస "

" అనేకమంది నానుండి ధనం, పలుకుబడి, గౌరవం, ఉద్యోగం, రోగనివారణం మొదలైన ప్రాపంచిక విషయాలనే అడుగుతారు. కానీ ... బ్రహ్మజ్ఞానం ఇవ్వమని అడిగేవాళ్ళే లేరు ! "

" మరణం లేదు ! "




" మనం పుట్టినప్పుడే మరణాన్ని వెంటబెట్టుకుని పుడుతున్నాం. మనం ఈ క్షణమే చనిపోయినా లోకం మామూలుగానే ఉంటుంది. మరణించినవాళ్ళు మరలా జన్మించరని నమ్మితే దుఃఖించాల్సిన పనిలేదు. మరలా పుడతారని నమ్మినా దుఃఖించాల్సిన పనిలేదు ! ఈ రోజు శరీరాలతో ఉన్నవాళ్ళు రేపు అశరీరులుగా ఉంటారు ... మహాప్రళయంలో పరమాత్మలో లీనమై ఉంటారు ! అంతేకాని ' లేకపోవడం ' అనేది సృష్టిలోనే లేదు ! "

" దానము "

" దానం చేయడం విత్తనాలు నాటడంవంటిది ! ... అది ముందు ముందు ... గొప్పపంటగా మారుతుంది ! గతజన్మలో దానం ఇచ్చినదే ... ఈ జన్మలో సంపదగా అనుభవిస్తున్నాం. ఇవ్వగలడం ఒక్కటే స్వీకరించడానికి మార్గం ! "

" కర్మఫలం వెన్నంటి ఉంటుంది ! "



" మనం చేసే పనులే మన కర్మఫలాలై మన వెన్నంటి హాని కలిగిస్తాయి. ఋణం ... శతృత్వం ... హత్య ... వీటికి ... ఇప్పుడు కాకపోతే ఇంకో జన్మలోనైనా పరిహారం చెల్లించక తప్పదు ! కాబట్టి కర్మఫలాన్ని ఓర్పుతో అనుభవించాలి. ' కావాలి ' అన్న కోరిక విడిచి దైవం పై మనస్సు నిలిపితే ... ఆయనే ఎలా చక్కబరచగలడో చూడగలవు. "

" శరీరం చైతన్యరథం ! "

" ఈ శరీరం ఒక రథం, ఆత్మ ... దాని యజమాని, బుద్ధి ... సారథి, మనస్సు ... కళ్ళెం, ఇంద్రియాలు ... గుఱ్ఱాలు, విషయాలు ... వాని మార్గాలు. ఎవరికి మనోనిగ్రహం లేదో ... ఎవరైతే ఇంద్రియాలను తమ స్వాధీనంలో ఉంచుకోలేరో ... వారు గమ్యాన్ని చేరలేరు ! ఎవరికి గ్రహించే శక్తి ఉందో ... ఎవరి మనస్సు, ఇంద్రియాలు వారి స్వాధీనంలో వుంటాయో ... వారే గమ్యాన్ని చేరగలరు ! ఎవరు బుద్ధిని మార్గదర్శిగా గ్రహించి ... దానిని మనస్సనే పగ్గంతో లాగి పట్టుకోగలరో ... వారు మాత్రమే జీవన గమ్యమైన ' విష్ణుపదం ' చేరగలరు. "

" ప్రతి ప్రాణినీ ఆదరించు ! "

" నీ దగ్గరకు వచ్చిన ప్రతి ప్రాణినీ ఆదరించు. ఋణానుబంధంపై నమ్మకం ఉంచి ఎవరైనా ఏదైనా అడిగితే సాధ్యమైనంత వరకు ఇవ్వు. ఆకలితో ఉన్నవారికి ముందుగా భోజనం పెట్టిన తరువాతనే మీరు తినాలి. అతిధి అంటే ' మనిషి ' అనే కాదు ... క్రిమికీటకాది సమస్త ప్రాణికోటీ అతిధులే ! ఆకలితో ఉన్న ఏ కుక్కకు అన్నం పెట్టినా ... అది నాకు పెట్టినట్టే ! క్రిమికీటకాలతో సహా ఈ కనిపించే సకల జగత్తూ నా రూపమే ! అన్ని జీవులలో నన్నూ ... నాలో సర్వ జీవులనూ చూడు ! నేనుకానిది ఏదీ లేదు ... నీవు చూసేదంతా కలిసి నేనే ! అందరిలో నన్ను చూసేవాళ్ళు నాకు ఆప్తులు. "

" నేర్పు - నేర్చుకో ! "

" మనం ఒకరినన్నా ఆశ్రయించాలి ... లేదా ఇతరులకు మార్గమన్నా చూపాలి. నీవు నేర్పగలిగితే నేర్పు ... నేర్చుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నాను ! నీవు నేర్చుకొనగలిగితే నేర్చుకో ... నేర్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను ! "

" ధారాళంగా ఇవ్వాలి ! "

" ఎవరి సేవనూ ఉచితంగా పొందకూడదు ... తగిన ప్రతిఫలాన్ని ధారాళంగా ఇవ్వాలి ! నేను తీసుకున్న దానికి పదిరెట్లు ఇస్తాను ! ఇవ్వడంలో నా లోపం ఉండదు ... పుచ్చుకోవడంలో నీదే లోపం ! "

" ఆహార విహారాలు "

" స్వల్పంగా తిను ... రుచులకు పోవద్దు ... ఒకటి రెండు వంటకాలతో తృప్తి చెందు ! తృప్తిగా తిను ... తృప్తిగా నిద్రపో ... కానీ అతి వద్దు ! ఉపవాసాలు ఆరోగ్య సూత్రాలే తప్ప ... ఆధ్యాత్మిక సూత్రాలు కావు ! యాత్రకు గానీ ... పండుగకు గానీ ... పబ్బానికిగానీ ... అప్పుచేయవద్దు. "

" అంతా ఒక్కటే ! "

" మనుష్యులు వారంతా ఒకరి నుంచి ఇంకొకరు వేరనుకుంటారు ... కానీ అది పొరపాటు. ' నేను నీలో ఉన్నాను ... నీవు నాలో ఉన్నావు ' అని భావన చేస్తూ ఉండు ... అదే అనుభవమౌతుంది. అడ్డుగోడ తొలగించు ! ఇచ్చేవాడు ... ఇవ్వబడేది ... పుచ్చుకునేవాడూ ... అందరూ ఒక్కటే ! ఎవరికెవరూ శత్రువులు కారు ! ... అంతా ఒక్కటే ! కోపం ... అసూయ ... స్వార్థం విడిచిపెట్టు. మీకు కీడు చేసిన వారికి కూడా అపకారం చేయవద్దు. చేయగలిగినంతవరకు ఇతరులకు మేలు చేయి. "

...

" మలినాలను పోగొట్టుకోడానికి అనేక మార్గాలున్నాయి ... మట్టి, నీరూ, సబ్బు ... వంటివి. కానీ ఇతరులను నిందించే వాని పద్ధతే వేరు ! ... వాడు తన నాలుకతోనే ఇతరులను శుభ్రపరుస్తాడు ! పంది కసవునే తినే విధంగా ... కొందరు ఇతరుల తప్పులనే ఎంచుతారు ! "

" నా సమాధి ! "



" నా ప్రాణాలనైనా ఇస్తాను కానీ మాట మాత్రం తప్పను ! నా ప్రాణం పోయినా సరే నా ఆత్మ నా మాటను నిలబెడుతుంది ! నేను శరీరాలు మారుతానే గానీ ... నాకు చావులేదు. నా భక్తుని ఇంటిలో అన్నవస్త్రాలకు లోటు ఉండదు ! నా సమాధి నన్నాశ్రయించిన వారితో మాట్లాడుతుంది ! నా సమాధి నుంచి కూడా నా కర్తవ్యం నిర్వహిస్తాను ! నాకు ... నా పటానికీ ... నా విగ్రహానికీ ... భేదం లేదు ! ద్వారకామాయి ప్రవేశించితే ... సర్వ సంపదలు పొందగలరు ! ఇక్కడి ఫకీరు అత్యంత దయామయుడు ! ఇక్కడ కాలు పెట్టడంతోటే ఎంతటి కష్టమయినా తీరవలసిందే ! సూర్యచంద్రాదులు ఉన్నంతవరకు ... నా అవతారకార్యం కొనసాగుతూనే ఉంటుంది ! "

" జీవిత విశేషాలు "



పేరు	: అందరూ సాయిబాబా అంటారు
తండ్రి	: ' బ్రహ్మ '
తల్లి	: ' మాయ '
గురువు	: వెంకూసా
మతం	: కబీరు
కులం	: దైవం
వయస్సు	: లక్షల సంవత్సరాలు !
నియమం	: అబద్ధం చెప్పకపోవడం !
వృత్తి	: తరించే మార్గం చెప్పడం !
దక్షిణ	: విశ్వాసం, సహనం
ద్వారకామాయి	: మతభేదం లేకుండా అందరికీ నాలుగు పురుషార్థాలకూ ద్వారాలు తెరచి ఉండేది !
ధుని ఎందుకు ?	: అందరి పాపాలు దహించడానికే !